క్లుప్తంగా

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు
- పీహెచ్‌సీలు తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

బోయినపల్లి: అసెంబ్లీ ఎన్నికల సమయంలో పీహెచ్‌సీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు ఆదేశించారు. మండలంలోని కొదురుపాక, బోయినపల్లి, విలాసాగర్ పీహెచ్‌సీలను గురువారం తనిఖీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బ్యానర్లు, పోస్టర్లలో అధికార పార్టీ నాయకుల ఫొటోలు లేకుండా చూడాలన్నారు. పీహెచ్‌సీల పరిధిలో ఎన్నికల కోడ్ విధిగా పాటించాలని సూచించారు. డాక్టర్లు రేణుప్రియాంక, రేణుక, అనిత, సూపర్‌వైజర్లు శశి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోరం లేక మండల సభ వాయిదా



ఖాళీ కుర్చీలతో సమావేశ మందిరం

చందుర్తి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ధాన్య కొనుగోళ్లపై లెక్కలు తెల్చకుండా గురువారం సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సభ్యులు సమావేశానికి కాలేదు. గత సమావేశంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం, కోతలు వివరాలు తెలపాలని సభ్యులు డిమాండ్ చేశారు. వివరాలు సభ దృష్టికి తీసుకువస్తేనే సమావేశాన్ని కొనసాగిస్తామని, లేదంటే సమగ్ర సమాచారంతో వారం రోజుల్లో తిరిగి సభను ఏర్పాటు చేయాలని సభ్యులు, అధ్యక్షురాలు లావణ్యకు సూచించారు. దీంతో కోరం లేదని ఎంపీపీ బైరగోని లావణ్య, వైస్‌ఎంపీపీ అబ్రహం, లింగంపేట ఎంపీటీసీ పెగ్గర్ల రమేశ్‌రావు సభ నుంచి వెళ్లిపోవడంతో సమావేశ మందిరం ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు



పట్టుకున్న బెల్లం పానకంతో ఎస్సై, ఏఎస్సై

కోనరావుపేట: గ్రామాల్లో నాటుసారా విక్రయాలు జరిపితే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆంజనేయులు అన్నారు. మండలంలోని జైసేవాలాల్ ఊరుతండాకు చెందిన భుక్యా లత సారా విక్రయాలు జరుపుతుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. ఆమె వద్ద లభించిన 250 గ్రాముల పటిక, 2 లీటర్ల నాటుసారా, 25 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. 60 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా నాటుసారా విక్రయాలు జరిపినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రవి, విశాల్, తిరుపతి ఉన్నారు.

చండీ హోమాలు, కుంకుమార్చనలు



ముస్తాబాద్: పోతుగల్‌లో మహా చండీయాగం నిర్వహిస్తున్న భక్తులు



వేములవాడఅర్బన్: రుద్రవరంలో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ఎల్లారెడ్డిపేటలో హోమం చేస్తున్న వేద పండితులు



గంభీరావుపేట: అమ్మవారికి మంగళహారతి ఇస్తున్న మహిళలు



రుద్రంగి: కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

వేములవాడ/వేములవాడఅర్బన్/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/రుద్రంగి/బోయినపల్లి: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని దుర్గమాత మండపాల వద్ద భక్తులు చండీ హోమాలు, కుంకుమపూజలు నిర్వహించారు. భక్తులు దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. మండపాల వద్ద భజన, సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అమ్మవారిని ప్రజాప్రతినిధులు, నాయకులు దర్శించుకుంటున్నారు.

నియామకం

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



నియామకపత్రం ఇస్తున్న మేడిపల్లి సత్యం

బోయినపల్లి: కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన కత్తెరపాక శ్రీనివాస్‌ను నియమిస్తున్నట్లు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, ఎస్సీ సెల్ చైర్మన్ ఆకునూరి బాలరాజు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, భీంరెడ్డి మహేశ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు.

అమ్మవారి పూజలకు విరాళం



అమ్మవారికి పూజలు చేస్తున్న బెంద్రం తిరుపతిరెడ్డి

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలోని ఆరెపల్లి, సోమారంపేట, సిరికొండ, పెద్దలింగాపూర్ గ్రామాలో ఏర్పాటుచేసిన శ్రీ కనక దుర్గాదేవి మండపాలకు బీజేపీ మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతి రెడ్డి విరాళాలు అందజేశారు. అమ్మవార్లకు పూజాసామగ్రి కొరకు బీటీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.20,555 అందించారు. కార్యక్రమంలో దండవేణి రజనీకాంత్, నిఖిల్ రెడ్డి, రమేశ్‌రెడ్డి, కిరణ్ రెడ్డి, రాజు, సంతోష్‌రెడ్డి, నితిన్, రంజిత్, ప్రశాంత్, సుమన్, హరీశ్, తిరుపతి పాల్గొన్నారు.


హైమాస్ట్ లైట్లు ప్రారంభం



మాట్లాడుతున్న బంజారా సేవా సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మంత్రి కేటీఆర్, జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావు సహకారంతో హైమాస్ట్ లైట్లు ప్రారంభించుకున్నట్లు ఆలిండియా బంజారా సేవా సంఘం సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని దుమాల గ్రామంలో ఉన్న ఏకలవ్య గురుకుల పాఠశాలలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానిక జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావుకు విన్నవించగా మంజూరు చేయించినట్లు తెలిపారు.

సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం



విద్యుత్ వెలుగుల మధ్య వేములవాడ మూలవాగు

- నేడు వేములవాడలో వేడుకలు
- రూ.22 లక్షలతో ప్రత్యేక ఏర్పాట్లు
- జిగేల్‌మంటున్న మూలవాగు

వేములవాడ: వేములవాడలో శుక్రవారం జరుపుకునే సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం చేశారు. పట్టణ శివారులోని మూలవాగు బతుకమ్మ తెప్ప వద్ద జిగేల్‌మనిపించే విద్యుత్ వెలుగులను సిద్ధం చేసి ఉంచారు. మున్సిపల్ పరిధిలోని 28 వార్డులకు చెందిన మహిళలు అత్యంత భక్తిప్రపత్తులతో రంగురంగుల పూలను సుందరంగా అలంకరించి, బతుకమ్మ వేడుకలు జరుపుకోనున్నారు. రూ. 22 లక్షలతో మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం రాత్రి వరకు మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఏఈ నర్సింహస్వామి, ఇతర అధికారులు, సిబ్బంది, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు. డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

అలరించిన బతుకమ్మ వేడుకలు



గంభీరావుపేటలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో..

గంభీరావుపేట: మండల కేంద్రంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. రెడ్డి సంఘ భవనంలో భారీ బతుకమ్మను రకరకాల పూలతో పేర్చి మహిళలు సంప్రదాయ రీతిలో ఆడిపాడారు.



సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో బతుకమ్మ వేడుకలు సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో..

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో గురువారం మహిళా ఉద్యోగులు ఆట పాటలతో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఎస్‌టీఐ సారయ్య, రాంరెడ్డి, మల్లేశ్, నర్సయ్య పాల్గొన్నారు.

పూలకు గిరాకీ





వేములవాడ మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన రంగురంగుల పూలు

వేములవాడ: సద్దుల బతుకమ్మ సందర్భంగా పూలకు విపరీతమైన గిరాకీ వస్తోంది. వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు రంగురంగుల పూలను గురువారం కూరగాయల మార్కెట్, పాపన్న చౌక్, తెలంగాణ చౌక్‌లో అమ్మకానికి ఉంచారు. కిలో రూ.110 నుంచి రూ.120, రూ.130 వరకు అమ్మకాలు సాగించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా వాసులు

సిరిసిల్లటౌన్/సిరిసిల్లఎడ్యుకేషన్: కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు చెందిన పులువురు ప్రతిభ కనబరిచారు. జిల్లాకు చెందిన 46 మంది పోటీల్లో పాల్గొనగా పి. ప్రేమ్‌కుమార్, బి. రచన, రష్మిత, భానుప్రియ, హరిత ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పౌర సరఫరాల సంస్థల చైర్మన్ రవీందర్‌సింగ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు అస్సాంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు వెళ్లనున్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్, తదితరులు తెలిపారు.



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రవీందర్‌సింగ్

చిరుత దాడిలో ఆవు మృతి?

తంగళ్లపల్లి: మండలంలోని గోపాల్‌రావుపల్లె గ్రామంలోని బెంద్రంపల్లె శివారులో బెంద్రం బాల్‌రెడ్డికి చెందిన తొలుచూరు కాన్పుకు సిద్ధంగా ఉన్న ఆవును ఐకేపీ సెంటర్ వద్ద బుధవారం రాత్రి దాడికి గురై మృతిచెంది ఉంది. గురువారం ఉదయం ఆవు కళేబరాన్ని పరిశీలించి చిరుతపులి దాడిచేసి చంపి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశాడు. కానీ చంపింది ఏ జంతువో నిర్ధారణ కాలేదు. నష్టపరిహారం ఇవ్వాలని రైతు కోరాడు.



అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- ఒక్కసారి అవకాశం ఇవ్వండి
- బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

కోనరావుపేట: ఒక్కసారి అవకాశం ఇస్తే కోనరావుపేట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి చలిమెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల, పల్లిమక్త, కనగర్తి, ధర్మారం, మర్తనపేట, నాగారం, రాజన్నగొల్లపల్లి గ్రామాల్లో గురువారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్రంలోని ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అడుగడుగున అవమానాలు ఎదుర్కొన్న తెలంగాణ ప్రజలు నేడు ప్రత్యేక రాష్ట్రంలో గౌరవంగా బతుకుతున్నారన్నారు. మల్కపేటలో 3 టీఎంసీల నీళ్లతో త్వరలోనే సుభిక్షం అవుతుందన్నారు. ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నాడు పెన్షన్ రూ.200 ఉంటే సీఎం కేసీఆర్ రూ.2,016 అందిస్తున్నారన్నారు.

దేశంలో లేని అభివృద్ధి రాష్ట్రంలో జరుగుతోంది

దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి రాష్ట్రంలో జరుగుతోందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. రైతుబంధు, రైతుబీమా, పింఛన్లు, రుణమాఫీ తదితర పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రాజెక్టులతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



సుద్దాలలో ప్రచారం చేస్తున్న లక్ష్మీనర్సింహారావు

బీఆర్ఎస్‌లో చేరిక

మండలంలోని కొలనూర్‌లో కాంగ్రెస్ నాయకులు వీరవేణి తిరుపతియాదవ్, పల్లిమక్తలో చింతకుంట అనిల్, ఆదరవేణి నరేశ్, బాబు, ప్రశాంత్, కనగర్తిలో కాంగ్రెస్ నాయకులు సగ్గు నరేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బీరయ్యతో పాటు బావుసాయిపేటకు చెందిన యువకులు బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మీనర్సింహారావు సమక్షంలో పార్టీలో చేరారు.

రైతులు అధునాతన పద్ధతుల్లో సాగు చేయాలి

- జిల్లా ఏరువాక కేంద్రం, కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.మదన్‌మోహన్‌రెడ్డి
- ఆకట్టుకున్న వ్యవసాయ ప్రదర్శనలు

వీర్నపల్లి: వ్యవసాయంలో వస్తున్న అధునాతన సాంకేతిక విధానాలను అందిపుచ్చుకోవాలని జిల్లా ఏరువాక కేంద్రం, కోఆర్డినేటర్ డాక్టర్ కె.మదన్ మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ మధుకర్‌రావు అన్నారు. స్థానిక రైతు వేదికలో జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ వారి ఆధ్వర్యంలో పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనతో పాటు యాసంగి పంటల ప్రణాళిక మీద రైతులతో శాస్త్రవేత్తల చర్చాగోష్టి నిర్వహించారు. అనంతరం విద్యార్థులు రైతుల కోసం వ్యవసాయ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డా.ఉషారాణి, డా.ఎం. రాజేంద్రప్రసాద్, డా.భవ్యశ్రీ, డా.సతీశ్, ఎం మనోహర్ రెడ్డి, శోభ రాథోడ్, బాబు జగ్జీవన్‌రావు, మండల వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఫజిల్, ఆర్ఏడబ్ల్యూఈసీ విద్యార్థినులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కె.మదన్‌మోహన్ రెడ్డి

'తీర్మానం వెనక్కి తీసుకోవాలి'

గంభీరావుపేట: బీఆర్ఎస్‌కు రెడ్డి సంక్షేమ సంఘం ఏకగ్రీవంగా మద్దతునిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రజా ఆశీర్వద సభలో ప్రకటించడంపై ఆ సంఘం మండల నాయకులు తప్పుపట్టారు. గురువారం మండల రెడ్డి సంఘ భవనంలో సమావేశమై జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి తీరుపై నిరసన వ్యక్తం చేశారు. బేషరతుగా సంఘ సభ్యులకు క్షమాపణ చెప్పాలని, తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘ సభ్యులకు ఎలాంటి సమాచారం లేకుండా తీర్మానం ఇవ్వడానికి వ్యతిరేకించారు. ఈ సమావేశంలో రెడ్డి సంఘం నాయకులు రాజేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను విమర్శించే నైతిక హక్కు రాహుల్‌గాంధీకి లేదు

ఎలారెడ్డిపేట: తెలంగాణ సీఎం కేసీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీకి లేదని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అందే సుభాష్, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. గురువారం మాట్లాడుతూ బీఆర్ఎస్ చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక తమ పార్టీ అధినేతపై బురదజల్లుతున్నారన్నారు. నాయకులు పాల్గొన్నారు.

రోడ్ షోను విజయవంతం చేయాలి

చందుర్తి: మేడిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే రోడ్డుషోను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌కు ఆదరణ



మాట్లాడుతున్న దొమ్మాటి నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: ఆరు గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ లభిస్తుందని ఆ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో గురువారం మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆరు పథకాల గ్యారంటీ కార్డుల పంపిణీలో మహిళలు అత్యధికంగా పార్టీపై ఆదరణ చూపారన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజునాయక్, పట్టణాధ్యక్షుడు చెన్ని బాబు, బీపేట రాజు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఏకతాటిపై ఉండాలి

తంగళ్లపల్లి: మండలంలోని రాళ్లపేట గ్రామంలో గురువారం ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పడిగె బాముగారి పెద్దన్న ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దన్న మాట్లాడుతూ ముదిరాజులు అందరూ ఏకతాటిపై ఉండాలని నోటుకు ఓటును అమ్ముకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్లకు చేరిన పాదయాత్ర



నవీన్‌నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన ఆజ్మీరా నవీన్‌నాయక్ చేపట్టిన పాదయాత్ర గురువారం సిరిసిల్లకు చేరుకుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికి, నవీన్‌నాయక్‌ను శాలువాతో సన్మానించారు. పవర్‌లూమ్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సత్యం ఆరోపణలు అర్థరహితం

బోయినపల్లి: చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్‌పై, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం చేసిన ఆరోపణలు అర్థరహితమని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో నియోజకవర్గంతో పాటు, బోయినపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, వైస్‌ఎంపీపీ నాగయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా బీఆర్ఎస్ ప్రచారం



వేములవాడరూరల్: ప్రచారం చేస్తున్న ఎంపీపీ

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని బాలరాజుపల్లి, వెంకటాంపల్లి గ్రామాల్లో ఎంపీపీ బండ మల్లేశం ఆధ్వర్యంలో ఇంటింటా బీఆర్ఎస్ ప్రచారాన్ని నిర్వహించారు. సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి ఆయనతో పాటు ప్రచారంలో పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలో ఎంపీపీ గంగం స్వరూపారాణి గురువారం ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ ఎమ్మెల్యేగా చల్మెడ లక్ష్మీనర్సింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కుల తీర్మానం సరైంది కాదు

సిరిసిల్లఅర్బన్: తన స్వలాభం కోసం మిరాల భాస్కర్ యాదవ్ యాదవ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసి బీఆర్ఎస్ పార్టీకి యాదవ కులాన్ని తాకట్టు పెట్టడం సరికాదని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఆసరి బాలరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అఖిల భారత యాదవ మహాసభ, యాదవ హక్కుల పోరాట సమితి రెండే సంఘాలు ఉన్నాయన్నారు. సొంత లాభం కోసం సంఘాన్ని ఏర్పాటు చేసి, బీఆర్ఎస్ పార్టీకి యాదవ కులం ఏకగ్రీవంగా మద్దతు ప్రకటిస్తూ తెలపడాన్ని ఖండించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొక్కు దేవేందర్ యాదవ్, వాస మల్లేశం, మీర్యాల శ్రీనివాస్‌యాదవ్, వేల్పుల సాయి ప్రసాద్‌యాదవ్, గంగుల భాస్కర్ యాదవ్, మావరేణి చంద్రశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.